# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## గుర్తుకొస్తున్నాయి...

“ఆ రాత్రి అంతా నిద్రలేదు నాకు. రాధమ్మను ఒక అయ్యచేతిలో పెట్టవలసిన సమయం వచ్చిందా? ఇద్దరం ఒంటరి ఆడవాళ్ళం ఆ పని సక్రమంగా చెయ్యగలమా. మాపెళ్ళి మాజీవితంలో తెచ్చిన భయంకరమైన విషాదం తాలూకు భయం నాకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. కానీ తప్పదు. ఎందుకో చాలా దిగులు వేసింది. రాత్రంతా నిద్రపట్టలేదునాకు.తెల్లవారి పోలీసులు ఇంటికి వచ్చారు. “నిన్న జైలు భవనం మీద కాగ్రెస్ జెండా ఎగర వేయటం లో

పిల్లల సహకారం ఉన్నదని తెలిసింది. మీ అమ్మాయి లక్ష్మీ రాధమ్మే ఈ పనిలో సహాయపడిందని మాకు నమ్మకంగా తెలియవచ్చింది. మీ అమ్మాయిని పోలీసు స్టేషన్ కు తీసుకు రావాల్సి ఉంటుంది. లేకపోతే మేమే తీసుకు వెళతాం" అని గట్టిగా చెప్పారు. నేను కొంచెం కంగారు పడ్డాను. సమయానికి అక్కయ్యకూడాలేదు. సాంబశివరావుగారు ధైర్యం చెప్పారు. "కంగారు పడొద్దమ్మా. చిన్న పిల్లలను అరెష్టు చేయరు. రమ్మన్నారు కనుక ఒకసారి స్టేషనుకు వెళ్ళి రండి" అన్నారు.

"నేను గబగబా కొంచెం వంటచేసి రాధమ్మకు పెట్టి, నేనుకూడాతిని పోలీసు స్టేషనుకు అమ్మను వెంటపెట్టుకుని వెళ్ళాను. ఆసరికే అక్కడ ఇరవై మందిదాకా పిల్లలు ఉన్నారు. అందరినీ అక్కడే క్రింద వరుసగా కూచోపెట్టారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చెయ్యకూడదనీ చేస్తే శిక్షలు చాలా కఠినం గా ఉంటాయనీ హెచ్చరించారు.పెద్దవాళ్ళు కొందరు పిల్లలను వదిలి పెట్టమని ప్రాధేయ పడ్డారు. పిల్లలను చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నందుకు మిమ్మల్ని కూడా అరెష్టు చేస్తామని వాళ్ళను కూడా పోలీసులు బెదిరించారు.మూడు గంటల వరకూ కూర్చోపెట్టి అందరి పేర్లూ వ్రాసుకొని పిల్లలచేతా, పెద్దల చేతా సంతకాలు పెట్టించుకుని వదిలేశారు. కానీ రాధమ్మ చేసిన నేరం పెద్దది కనుక వదిలెయ్యలేదు. నాకు కంగారుగా అనిపించింది. విషయాన్ని మనిషిద్వారా సాంబశివరావుగారికి కబురు పంపించాను. ఆయన వెంటనే లాయరును తీసుకుని స్టేషనుకు వచ్చి, పోలీసులతో పోట్లాట పెట్టుకున్నాడు. చివరకు సాయంత్రం ఆరు గంటల వేళకి రాధను మాతో పంపించారు. పొద్దున తిన్న అన్నం పాపం పిల్ల తోటకూర కాడలా వాలిపోయింది."

నాకు వెంటనే కాంతం పిన్ని అదే అమ్మ చిన్ననాటి స్నేహితురాలు చెప్పిన ముచ్చట గుర్తొచ్చింది. ఐదేళ్ళ వయసులో కాంతం పిన్ని వాళ్ళ అన్నయ్యా, పిన్నీ, అమ్మా కలిసి ఆడుకునేవాళ్ళట. ఒకరోజు దొంగా, పోలీసు ఆట ఆడుకుంటంటే ఆ మావయ్యేమో పోలీసుగ ఉన్నాడట. కానీ ఇక్కడ ఆట వేరయ్యింది. దొంగలని పట్టుకున్న పోలీసుని అమ్మా, పిన్నీ కలిసి 'వందే మాతరం' అంటూ చితక్కొట్టేసారట . అతను ఏడుస్తూ అమ్మమ్మ దగ్గరికి వెళితే, అమ్మమ్మ అమ్మని ఎందుకు కొట్టావ్ వాణ్ణి గదమాయించిందట. అమ్మేమో వాడు బ్రిటీషు పోలీసు అందుకే తరిమి కొట్టాం అని చెప్పిందట. అందరూ నవ్వుకున్నారట. ఇంకోసారి వీళ్ళు బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటుంటే ఆ మావయ్యేవచ్చి నేను కలెక్టరుని ఈ పెళ్ళి చెయ్యటానికి వీల్లేదని బొమ్మలన్నీ చెదరకొట్టాడట. అమ్మేమో, అతను చొప్పదొడ్లో కూచుని ఉంటే ఇదే కలెక్టరు బంగళా అని చొప్పదంటు కాల్చి నిప్పు పెట్టేసిందట. చొప్పదొడ్డి తగలబడిపోతుంటే ఊరంతావచ్చి ఆర్పేశారట. రాధమ్మే తగలబెట్టిందన్న విషయం తెలిసి అమ్మమ్మ బాగా కేకలేసిందట కూడానూ. పైగా అదేమంటే బొమ్మల పెళ్ళికి హారతిచ్చాను అన్నదట. ఆటల్లో కూడా అవే భావాలున్న అమ్మ అంత ధైర్యంగా ఉండటంలో ఆశ్చర్యం ఏముందీ అనుకున్నాను. ఆ మాటే అమ్మమ్మతో అన్నాను.

ఆ తరువాత అమ్మ రాష్ట్ర స్వాతంత్ర సమరయోధుల పింఛన్ కు దరఖాస్తు పెట్టుకున్నప్పుడు గుంటూరు సబ్ జైలు నుండి ఈ సమాచారం వెతికి తీసుకోవటం జరిగింది. ఇది నాకు తెలుసు పైగా దానికి నరసరావు పేటలో ఉండే 'కరాచీ' తాతగారు ఈవిడ స్వాతంత్ర సమరయోధురాలే అని సంతకం పెట్టడం కూడా నాకు తెలుసు. 'కరాచీ' తాతగారు కూడా ఒక స్వాతంత్ర సమరయోధుడే. ఆయన కూడా చిన్నప్పటి నుండీ స్వాతంత్ర్య సంగ్రామం లో పాల్గొన్నాడు. పది, పన్నెండేళ్ళ వయసులోనే చిన్నప్పుడే కరాచీలో ఏవో సభలు జరుగుతుంటే ఇంట్లో చెబితే వద్దంటారని ఇంట్లో చెప్పకుండా ఒక్కడే ధైర్యంగా రైలు ఎక్కేసి 'కరాచీ' వెళ్ళొచ్చాడట.అందుకే చిన్నప్పుడే 'కరాచీ' అని పేరు వచ్చింది ఆయనకు. ఆ తరువాతకూడా బొంబాయి, కలకత్తా, మద్రాసు నాగపూర్ ఇలా ఎక్కడ సమావేశాలు జరిగినా తప్పకుండా వెళ్ళేవాడట. అప్పట్లో పిల్లల్లో కూడా దేశభక్తి అలాఉండేదట. ఆ కరాచీ తాతగారిని నేను బాగా ఎరుగుదును. తెల్లగా పొట్టిగా తెల్లని జుట్టుతో ఖద్దరు పంచె కట్టుకుని ఠీవిగా నడుస్తూ వెళుతుండేవారు.

అమ్మమ్మ నవ్వుతూ "అవునే ..ఆ కాలపు పిల్లల భావాలు కూడా అలానే ఉండేవి. అందరూ గుంపుగా కూర్చొని దేశభక్తి గీతాలు పాడుకునేవాళ్ళు. ఆటల్లో కూడా వాళ్ళు స్వాతంత్ర్యాన్నే కోరుకునేవాళ్ళు" అంది. ఇంక అమ్మ సంగతి చెబుతూ" ఒక వారం తరువాత అక్కయ్య వచ్చింది. అక్కయ్యకు జరిగిన విషయం చెప్పాను. అక్కయ్య ఎంతో సంతోషించింది శభాస్ మంచిపని చేశావంటూ అమ్మని మెచ్చుకుంది. తరువాత పెళ్ళివిషయం అక్కయ్యతో ప్రస్తావించాను. అక్కయ్య చిట్టెమ్మా పెళ్ళికి అప్పుడే తొందర ఏముంది. శారదా చట్టం కూడా అమలులో ఉందికదా ...ఇంకో నాలుగేళ్ళు గడవనీ అప్పుడే చేద్దాం పెళ్ళి అన్నది. "

"శారదా చట్టం అంటే బాల్య వివాహాల గురించేకదా అమ్మమ్మ" అన్నాను. "అవునే అమ్మాయి ఆడపిల్లలకు పదమూడేళ్ళు నిండాలి. మగపిల్లలకు పదహారేళ్ళు నిండితేగానీ పెళ్ళిచెయ్యకూడదని చట్టం వచ్చింది అప్పట్లో. గాంధీ గారు మరీ నెలల పిల్లలకు కూడా పెళ్ళిళ్ళు చేస్తున్నారని బాధపడి, హరి విలాస్ శారద అనే ఒక శాసన సభ్యుడి చేత ఈ చట్టాన్ని తెప్పించారు. అందువల్ల ఇది శారదా చట్టం అయింది. అంతేకాకుండా కందుకూరి విరేశలింగం పంతులు గారుకూడా చిన్న పిల్లలకు పెళ్ళిళ్ళు చెయొద్దని ప్రచారం చేశారు. పైగా మనకు చిన్నతనం లో పెళ్ళిళ్ళు జరిగినందువల్ల మనం అనుభవించింది చాలు. రాధమ్మకు కూడా అలాంటి కష్టం రాకూడదు. అందువల్ల రాధకు అప్పుడే పెళ్ళి వద్దన్నది అక్కయ్య."

"కానీ ఈడేరినాక పిల్లకు పెళ్ళిచేయడం నాకు ససేమిరా  ఇష్టం లేదు. ఆమాటే అన్నాను అక్కయ్యతో. సరే చూద్దాములే అని దాటవేసింది.కానీ అక్కయ్యను నేను నసపెడుతూనే ఉన్నాను రాధమ్మ పెళ్ళికోసం. చివరకు సరే అయితే ఇంక రాధమ్మకు పెళ్ళిచేద్దాము. అని  వరాన్వేషణ మొదలు పెట్టాము. ముందుగా మావురు వెళ్ళి మా ఆంజనేయునికి దణ్ణం

పెట్టుకుని అట్నుంచి దేచారం వెళ్ళి మాయింట్లో వండుకు తింటూ పదిరోజులు ఊళ్ళో ఉన్నాము. ఇంటికి వచ్చిన అందరూ "అమ్మాయి గారికి పెళ్ళి సేయరా అమ్మా" అని అడిగేవాళ్ళు. ఈలోగా మా అన్నయ్య ఆసాముల చేత దేచారానికి కబురు పంపేడు. పిల్లను తన కొడుక్కి చేసుకుంటానని. అక్కయ్య తోకతొక్కిన తాచులా లేచింది కబురు తెచ్చిన వారిమీద. "పసిపిల్లగానే పిల్లను చంపాలని చూసిన వాడింటికి మా బిడ్డను కోడలిగా ఎలాపంపిస్తాం...ఈ సారి ఇంకేరకంగా చంపుతాడో. తెలిసి తెలిసి ఆ రాక్షసుడి ఇంట్లో పిల్లని ఇస్తామా " అంటూ.

"ఈ లోగా కనుపర్తి నుంచి తెలిసిన వారెవరో వచ్చారు.లక్ష్మీ నారాయణ గారి కుటుంబం లో మంచి మగపిల్లలు ఉన్నారు. బాగా చదువుకున్నారు పిల్లకు చేసుకోండి. పెంచిన పిల్లేకదా గోత్రం తో ఇబ్బంది లేదు అంటూ. నిజమేకానీ ...గత రెండుమూడు సంవత్సరాలలో ఆ యింట్లో చాలా మంది మృత్యు వాత పడ్డారు ఎందుకో తెలీదు. మాలో ఒకరకమైన భయం. భగవంతుడు మాకువేసిన శిక్షచాలు. రాధమ్మకు ఆగతి రాకూడదు అనుకున్నాం కదా అందుకే ఆ సబంధం వద్దనుకున్నాం. "

"మా రూపెన గుంట్ల వాడు, మా నాన్నకు తమ్ముడి వరసయ్యే మా బాబాయి కొడుకు పిచ్చయ్య అన్నయ్య భార్య వర్ధనమ్మ కు ఐదుగురు కొడుకులనీ, అన్నయ్య చనిపోతే ఐదుగురు కొడుకులతో విజయవాడలో కష్టపడుతూ కుంతీ దేవిలా బ్రతుకుతోందనీ తెలుసుకున్నాం. ఆవిడ కూడా మాకు బాగ తెలుసు. తను పొనుగుపాటివారి ఆడపడుచు. ఐదుగురు కొడుకులు కనుక ఒక పిల్లవాడికి పెళ్ళిచేసి మనదగ్గర ఉంచుకోవడానికి అభ్యంతర పెట్టదు అనుకున్నాం. మళ్ళీ గుంటూరు వెళ్ళి రాధను సత్యభామ అక్కయ్య దగ్గరే ఉంచి ఇద్దరం విజయవాడ వెళ్ళాం. వర్ధనమ్మ చక్కని మనిషి. భర్తను పోగొట్టుకుని పుట్టెడు బాధలో పిల్లలను పెట్టుకుని జీవిస్తూ ఉన్నది. ఐదుగురూ మగపిల్లలే ఆడపిల్లలు లేరు. పిల్లలుకూడా పంచపాండవుల్లాగా ఉన్నారు. అప్పట్లో దాస భక్తి బాగా ప్రచారం లో ఉంది. పిల్లల పేర్లు కూడా అన్నయ్య చాలా బాగా పెట్టాడు . రామదాసు, కృష్ణదాసు, మోహనదాసు, గోపాలదాసు, శ్రీధర దాసు అని పెట్టేడు. పెద్దపిల్లాడు రామదాసుకు పదహారేళ్ళు చక్కనివాడు మనరాధకు తగిన వరుడని సంతోషించి పెళ్ళి కుదుర్చుకున్నాం."

"పెళ్ళి ఎక్కడచెయ్యాలని చాలా రోజులు తర్జన భర్జనలు పడ్డాం. విజయ వాడలోనో , గుంటూరులోనో పెద్దగా హడావుడి లేకుండా చేద్దామన్నాను నేను. అక్కయ్య అందుకు ఒప్పుకోలేదు. రూపెనగుంట్లలో రాముల వారి గుళ్ళో చేద్దామంది. అసలే శారదా చట్టం అమలులో ఉంది. వాడు పోలీసులకు ఉప్పందిస్తే అభాసు పాలు అయిపోతాం వద్దన్నాను. అయితే దేచారం లో చేద్దాం. పిల్లవాడికి పదహారేళ్ళున్నాయి కనుక భయం లేదు. పిల్లకు పది కాకుండా పదమూడేళ్ళని చెబుదాం అన్నది."

“ఏమైతే అదయిందని ధైర్యం చేసి పిల్లకు దేచారం లో అంగరంగ వైభవంగా పెళ్ళిచేశాం. గుంటూరునుండీ, కనపర్తి నుండీ, పేటనుండీ చుట్టాలు వచ్చారు. రాధ నన్ను అమ్మా అని పిలుస్తుంది కనుక నా గొత్రికులతోనే కన్యధార పోయించాను. మా రూపెన గుంట్ల నుండి చాలామంది రైతులు వచ్చారు మా దత్తు అన్నయ్య రాలేదు. బహుశా మొహం చెల్లలేదు అనుకుంటా. చిన్న పిల్ల కనుక ఈడేరే వరకూ మాదగ్గరే ఉంచుకున్నాం. ఈ లోగా రంగడికి కూడా పెళ్ళి కుదరటం తో అందరం గుంటూరు వెళ్ళాం.”

“పెళ్ళి తరువాత కొంతకాలం గుంటూరులో ఉన్నాం. ఇంతలో మన స్వాతంత్రోద్యమ ఫలితం రాబొతున్నదనీ భారత దేశం స్వతంత్ర దేశం అయ్యే శుభఘడియలు రాబోతున్నాయనీ వార్తలు సందడిచేయసాగాయి. ఇంకమాకు దేచారం వెళ్ళబుద్ధికాలేదు. ఆ ఆనందొత్సాహాలన్నీ గుంటూరులోనే జరుపుకోవాలి అనిపించింది. రాధమ్మతో అక్కడే ఉండిపోయాము. కొన్ని నెలల తరువాత అనేక గొడవలూ, కొట్లాటలూ పెట్టి మీదేశాన్ని మీరే ఏలుకొమ్మని వదిలేసి వెళ్ళారు ఇంగ్లీషువాళ్ళు. అఖండ భారతాన్ని భారత్ పాకిస్తానులుగా విడగొట్టి రెండు ముక్కలు చేసి కొన్ని గంటలు ముందుగా వారికి స్వాతంత్రాన్ని ప్రకటించి, తర్వాత మనకు ప్రకటించారు. జిన్నా అనే ఆయన ముస్లిం లకు వేరే దేశం ఇవ్వాలని పట్టుబట్టటం తో గాంధీజీకి తలవంచక తప్పలేదు. మేము ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకుంటూ ఉండగానే ముస్లిం దేశం లో ఉండాలని ఇటువైపు ముస్లింలు , హిందూ దేశం లో ఉండాలని అటువైపు హిందువులూ అటూ ఇటూ మారటం లో గందరగోళం ఏర్పడి గొడవలు మొదలయ్యాయి. రెండు దేశాలలోను రెండు మతాలవారూ ఆస్థి పాస్థులు వదిలేసి వెళ్ళవలసి రావటం తో ఆక్రోశం తో గొడవలు జరిగాయి. కొంతకాలానికి గొడవలు సద్దుమణిగాయి. స్వాతంత్ర్యం లభించిందని ఎంతో ఆనందపడ్డాం. కానీ భారత్ , పాకిస్తాను సరిహద్దుల్లో గొడవలు మమ్మల్ని ఎంతో కలవరపెట్టాయి. అప్పటికీ గాంధిజీ నెహ్రూజీ లాంటి నాయకులు, అందరినీ సంయమనం తో వ్యవహరించమని పత్రికలలో నూ రేడియోలలోనూ పదే పదే సందేశాలు ఇచ్చేవారు. గుంటూరులో అప్పుడు వరండాలో రేడియో పెట్టేవాళ్ళు. ఆ రేడియో చుట్టూ కనీసం యాభై మందయినా కూర్చొని ఉండేవాళ్ళు.”

“ఈ గందర గోళం లో దేశం ఉండగానే గాంధీగారిని చంపేశారన్న పిడుగులాంటి వార్త మమ్మల్ని ఎంతగానో కలవరపెట్టింది. గాంధీగారి గురించి కన్నీరు మున్నీరుగా విలపించాము. పదిహేను రోజులపాటు సత్రంలో గాంధీగారి చిత్రపటం పెట్టి రోజూ సంతాప సభలు జరిపాము. నేనూ అక్కయ్యా ఆ రోజంతా భోజనమే చేయలేదు. మా అందరిలోనేకాదు యావత్ భారతదేశం లోనూ ఇంటిపెద్దను కోల్పోయిన బాధ. ఏ ఇద్దరం కలిసినా గాంధీగారి ముచ్చట్లే. వివిధ సమయాల్లో ఆయన చూపించిన ధైర్యం గురించీ తీసుకున్న నిర్ణయాల గురించిన విశేషాలే. ఏపదవినీ ఆశించని ఆయన గురించిన పొగడ్తలే. ఆయన రామనామం చేస్తూ పోయాడని ఆయనకు సద్గతులు ప్రాప్తిస్తాయనీ ఇలా కబుర్లు

చెప్పుకునే వాళ్ళం. రేడియో దగ్గరే కూర్చుని ఆయన అంతిమ యాత్రావిశేషాలు వింటూ అందరం భోజనం కూడా చెయ్యలేదు. తరువాత అందరం తలస్నానాలు చేసి వంటలు చేసుకున్నాం.” చెప్పింది అమ్మమ్మ. నిజంగా వారు గాంధీజీని ఎంతగా ఆరాధించే వారంటే ...నాకు బాగా గుర్తు గాంధీ గారి చిన్న ఫోటో ఒకటి మాదేవుని మందిరం లోనూ, ఇంకోటి మా పెద్దమ్మమ్మ చదువుకునే భగవద్గీత లోనూ ఉండేది.

నేను ఇంటర్ లోకి వచ్చాక మా చిన్నమ్మమ్మ తీర్థ యాత్రలకు వెళ్ళివచ్చి బ్రహ్మ కపాలం లో పిండప్రదానం చేయించినప్పుడు గాంధీ గారికి కూడా పిండప్రదానం చేయించానని చెప్పటం నాకింకా గుర్తుంది.

“అలాగ స్వాతంత్ర్యం లభించిన ఆనందం తో బాటు గాంధీ గారి మరణం తాలూకు విషాదాన్ని మూటకట్టుకుని, మేము దేచారం తిరిగి వచ్చేశాం. ఇంతలో రాధమ్మ పెద్దమనిషైంది. అక్కయ్య ఊరందరినీ పిలిచి బంతి భోజనాలు పెట్టింది.ఇంక రాధమ్మని అత్తవారింటికి పంపక తప్పలేదు మాకు. చీరే సారే పెట్టి కాపరానికి పంపించే ఏర్పాట్లు చేశాం. రాధమ్మని కాపరానికి పంపిస్తూ ఎంతగానో బాధపడ్డాను. శకుంతలను పెంచిన కణ్వుడికే ఈ పుత్రికా వియోగ భారం తప్పలేదు మేమెంత అనుకున్నాం.రాధమ్మని విజయవాడలో దించటానికి వెళ్ళి తిరిగి వస్తూ ఎంతగానో ఏడ్చాను. అక్కయ్య మాత్రం గుంభనం గా ఉంది. అప్పటికీ వర్ధనమ్మను అడిగాను. అల్లుడినీ అమ్మాయినీ మాదగ్గరే ఉంచుకుంటాము అని ప్రాధేయపడ్డాను. నాకొడుకు చదువుకున్నాడు. ఆ పల్లెటూర్లో వ్యవసాయం చెయ్యడు మంచి ఉద్యోగం చూసి ఉద్యోగం వచ్చిన చోటే కాపరం పెట్టించమంది.”

“ఈలోగా తను విజయవాడలోనే ర్యాలీ కంపెనీలో ఉద్యోగం చూసుకున్నాడు. మేము దేచారం లో ఉండగానే సరస్వతి అక్కయ్యను కన్నది అమ్మ. నాన్న సరస్వతి అని పెడదాం అంటే నెహ్రూ గారి సోదరి విజయలక్ష్మి పండిట్ పేరు కూడా రావాలని విజయలక్ష్మి సరస్వతి అని పేరు పెట్టుకున్నాం. ఆ తరువాత మూడేళ్ళకు సావిత్రి అక్కయ్య పుట్టింది. సరోజినీ నాయుడు పేరు రావాలని సరోజిని సావిత్రి అని పెట్టుకున్నాం. ఆ తరువాత చీరాల I L T D కంపెనీలో నాన్నకు ఉద్యోగం చూసింది అక్కయ్య. ఈ లోగా మూడో అక్కయ్య సుప్రభ పుట్టింది. నిత్యానందం తాతయ్యకు కూడా వేటపాలెం లో పదెకరాలు ప్రభుత్వపొలం వచ్చింది. ఆయన తప్పని సరి పరిస్థితులలో పొలం మమ్మల్నే సాగుచేసుకొమ్మన్నాడు మాకూ పిల్లలని వదిలి ఉండలేని పరిస్థితి. అందుకే రూపెనగుంట్ల లోని పొలం అమ్మేసి వేటపాలెం చేరిపోయాం. ఆ వూరిలో మేము అనుభవించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అమ్మమ్మ ఎంతో ఆవేదనతో చెప్పుకొచ్చింది.”

“కొన్నాళ్ళ పాటు జీవనం గడవటానికి, బీడు భూమి బాగుచేయటానికి, రూపెన గుంట్లలో పొలం అమ్మినడబ్బులున్నాయి. నాన్నకు బాగానే జీతం వచ్చేది. బంజరు పొలం సాగులోకి తేవటం అంటే చాలా ఖర్చుతో కూడుకున్నపని. అది ఏలాగోలా పూర్తిచేశాం. పొలం ఫలసాయానికి వచ్చింది. ఈ లోగా శ్రీలక్ష్మి పుట్టింది. నలుగురూ

ఆడపిల్లలయినా కించిత్తు విచారపడలేదు ఆనందంగా పిల్లలను పెంచుకున్నాం. కానీ నాన్నకు ఈ ఉద్యోగం నచ్చలేదు.అతను చాలా తెలివి గలవాడు. చక్కని ఇంగ్లీషు మాట్లాడేవాడు. మంచి స్ఫురద్రూపి. నేను వ్యాపారం చేస్తానని కర్నాటక వెళ్ళి మధ్యలో వస్తూపోతూ ఉండేవాడు. అక్కడే వేటపాలెం లోనే ఉమ ,ప్రసాదు, నువ్వూ, రాణి కూడా పుట్టారు."

"సరస్వతినీ, సావిత్రినీ డిగ్రీకోసం నరసరావుపేటలో డిగ్రీ కోసం పంపించాము. ఈ పరిస్థితుల్లో నమ్ముకున్న భూమాతకూడా మమ్మల్ని నట్టేట ముంచింది వరుసగా మూడు సంవత్సరాలు పంటలు వోదెలమీద ఉన్నప్పుడు తుఫాన్లు వచ్చాయి. ఒక్క గింజకూడా చేతికి రాని పరిస్థితి. ఇంట్లోని గుండిగలూ గంగాళాలూ తాకట్టుకి చేరాయి."

"ఈలోగా సరస్వతిని వివాహం చేసుకుంటామని మంచి సంబంధం వచ్చింది. సరస్వతి మామగారు చాలా మంచివాడు. మాతరఫున తనే పెళ్ళిపన్లన్నీ చేసుకుని ఆపిల్లను కోడలిగా చేసుకున్నాడు. అప్పటి నీకు సంవత్సరం నిండింది అంతే చాలా చిన్నపిల్లవి. " చెప్పింది అమ్మమ్మ

నాకు కాంతం పిన్ని చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. "మీ నాన్న వయసులో ఎంత అందగాడు అనుకున్నావు !! అందరూ సినిమా యాక్టరు ఎవరో వచ్చారని గోడలు ఎక్కి మరీ చూసేవాళ్ళు తెలుసా" అని చెప్పింది. నాకు ఊహతెలిసి నేను చూసేసరికి నాన్న ఆరడుగుల ఆజానుబాహుడు, మంచి తెల్లని ఒంటిరంగూ తెల్లబడిన వత్తైన ఉంగరాల జుట్టుతో హాలీఉడ్ హీరోలా ఉండేవాడు. ఎంతో తెలివిగల వాడనీ పదహారు భాషల్లో మాట్లాడగలవాడనీ పేరు. కానీ స్వేచ్ఛాజీవి. అప్పుడప్పుడూ వచ్చి ఆరేడు నెలలు ఉండేవాడు అప్పుడు నాన్న , మా పొరుగింట్లో ఉండే స్కూల్ టీచర్ శేషగిరి పెదనాన్న గారూ ఇంకొంత మంది కలిసి లైబ్రరీ హాల్లో షెక్స్ పియర్ ఇంగ్లీషు డ్రామాలు వెయ్యడం నాకు గుర్తు. ఇంత మంది పిల్లల సంరక్షణ బాధ్యత మీద వేసుకుని ఆ పెద్దవాళ్ళు ఎంతగా బాధపడిఉంటారో ...ఎంతగా ఆర్ధికంగా ఇబ్బందులు పడిఉంటారో ఇప్పుడు తెలుస్తుంది నాకు. కానీ వాళ్ళెంత బాధపడ్డా మాపై చూపించిన ప్రేమలో ఇసుమంత కూడా లోటులేదు. పైగా నన్ను నెలల వయసులో ఎవరో పిల్లలు లేని దంపతులు పెంచుకోవాలని ఆశపడి పక్కింటి ఆమ్మగారిని అడిగారట. మాకేమైనా ఇస్తారా దత్తత చేసుకుంటాం అని. పెద్దమ్మమ్మ కర్రతో కొట్టినంత పని చేసిందట మా బంగారు తల్లులను ఎందుకిస్తాం అని. తర్వాత అమ్మమ్మ నాతో చెబుతుండేది ఈ సంఘటన. అంత ప్రేమగా పెంచుతూ మాకు ఏకష్టం తెలియకుండా పెంచటానికి ఎంత కష్టపడి ఉంటారో ఆ చిన్న వయసులో మాకు అవగాహన లేకపోవచ్చు కానీ కాస్త పెద్దయ్యాక వారిశ్రమ విలువేమిటో మాకు బాగాతెలిసింది.

ఎన్ని కుటుబపరమైన ఒత్తిడులు ఉండనీగాక , అమ్మమ్మ రుక్మిణీ స్త్రీ సమాజం లో సభ్యురాలిగా ఉంటూ ఎంతమంది ఆడవాళ్ళకో విద్యా బోధన చేసేది. ముఖ్యంగా హిందీ నేర్పించేది. మధ్యాహ్నాలు అరుగుమీద భారత, భాగవత, రామాయణ పురాణ కాలక్షేపాలు ఉండేవి. నలుగురికీ మంచి చెప్పటం. ఆచరించటం ఆవిడ నిత్యకృత్యం గా ఉండేది. ఒక్కోసారి పదకొండింటికల్లా పూజచేసుకొని భోజనం కానిచ్చి పొలం కూడా వెళ్ళేది. రాను పోనూ పది కిలోమీటర్లు పైమాటే నడిచి ఇల్లుచేరేది. ఒక్కోసారి రెండవ పంటగా మినిము చల్లించటానికి వెళ్ళినప్పుడు , వరిదుబ్బులూ , కోసిన కంది దుబ్బులూ గీరుకుని పాదాలు రక్తసిక్తం అయ్యేవి. వేడినీళ్ళతో స్నానం చేసి రెండు ముద్దలు తిని ఆరుబయట పడుకుంటే పిల్లలం పాదాలు తుడిచి మందు రాసేవాళ్ళం. నిత్యానందం తాతయ్య మా చదువుల విషయంలో ఎంతో శ్రద్ధ చూపించేవాడు. అందరినీ ప్రసిద్ధి చెందిన మా వేటపాలెం సారస్వత గ్రంధాలయానికి తీసుకువెళ్ళి సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగించేవాడు. మమ్మల్ని ప్రతి సాయంత్రం పార్కుకు తీసుకువెళ్ళి ఆటలు ఆడించి తెచ్చేవాడు. అప్పట్లో వేటపాలెంలో జీడిమామిడి తోటలు చాలా ఉండేవి. పార్కు దగ్గర్లో జీడిపప్పు కొట్లు చాలా ఉండేవి. వాటిలో' చిన్ని ' తాతయ్య గారి కొట్టు చాలా పేరుపొందింది. వాళ్ళ ఇల్లు మా వెనుక బజారులోనే ఉండేది. ఆ తాతయ్యకు నేను తెల్లగా ఉండి బాగా కబుర్లు చెబుతానని ఇష్టం. “ఇలాంటి సరస్వతీ దేవులు, బంగారు బొమ్మలు మాయిళ్ళలో ఎందుకు పుడతారమ్మా” అని బుగ్గలు పుణికేవాడు.గుప్పిళ్ళ కొద్దీ జీడిపప్పులు పెట్టేవాడు. నిత్యానందం తాతయ్య రాత్రి హోం వర్కులు దగ్గరుండి చేయించేవాడు. భోజనాలయ్యాక ఎన్నో పురాణ గాధలూ దేశభక్తుల చరిత్రలూ చెప్పేవాడు. ఏవిషయం అడిగినా దాని గురించి పూర్తి వివరాలు చెప్పేవాడు. పెద్దమ్మమ్మ మగవాడిలాగా బైట తిరుగుతూ మాకు కావాల్సినవి సమకూర్చేది. చిన్నమ్మమ్మ పొలం చూసుకుంటే అమ్మ ఇంతమందికీ వండిపెడుతూ వంచిన నడుము ఎత్తకుండా ఇంటెడు చాకిరీ చేసేది. ఆర్ధిక పరిస్థితులు ఎలాఉన్నా సంక్రాంతి బొమ్మల కొలువులూ, సందెగొబ్బెమ్మలూ, శ్రావణ మాసం పేరంటాలూ, దసరా పూజలూ, అట్ల తద్దెకు గోరింటాకులూ, తెల్లవారు ఝామున పెరుగన్నాలు ఇలా ఎంతో సందడిగా ఉండేవి మా రోజులు. వేటపాలెం గురుతులతో ఇప్పుడు నా మనసు ఎందుకో ద్రవీభవిస్తోంది.

అమ్మమ్మ మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది. “ఇంతలో ప్రభుత్వం మాకు కూడా కొంత భూమిని కేటాయిస్తామని. ప్రభుత్వ భూములు చూసుకొని ఏ ప్రదేశం లో కావాలో తెలియజేస్తే అక్కడే భూములు ఇస్తామని ప్రకటించింది. ఆ తరువాత కొంత కాలానికి మాకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్లు కూడా ఇచ్చింది పభుత్వం. మాలాంటి వాళ్ళకు అవి ఎంతగానో ఉపయోగ పడ్డాయి. లక్ష్మి, ఉమ కూడా హైస్కూలు చదువులు చివరిలో ఉన్నారు వాళ్ళు కూడా కాలేజీలో చేరాలంటే నరసరావు పేటకే వెళ్ళాలి. అందుకని నరసరావు పేటకు కుటుంబం తరలి వెళ్ళాలని

అనుకున్నాం. అక్కయ్య మనరూపెనగుంట్లలోనే కావలిసినంత ప్రభుత్వ భూమి ఉంది. అక్కడే భూమి కావాలని దరఖాస్తు పెట్టుకుందాం అంది.”

“నేను భయపడ్డాను. మళ్ళీ అక్కడికెందుకూ వద్దన్నాను కానీ అక్కయ్య ఊరుకోలేదు. “ఇది స్వతంత్ర్య భారతం వాడేం చేస్తాడు. అయినా ఇప్పుడు వాడు తప్పుకున్నాడు కొడుకు కరిణీకం చేస్తున్నాడు. తండ్రి చెడ్డవాడైనంత మాత్రాన కొడుకు కూడా చెడ్డవాడు అవుతాడా ఫర్లేదులే” అంది. ఆవూర్లోనే మళ్ళీ నిలబడాలని అక్కయ్య కోరిక. నేను కూడా గట్టిగా కాదనలేకపోయాను. ఇక్కడి పంటలా అంతంత మాత్రంగా ఉన్నాయి అందువల్ల మీ అందరి భవిష్యత్తు దృష్ట్యా నరసరావుపేట వెళదామని నిర్ణయించుకున్నాం. కానీ పరాయి పాలన లో అయినా, స్వతంత్ర భారతం లో అయినా స్త్రీల పట్ల సమాజం ఇంకా చాలా కఠినం గానే ఉన్నదనీ, మేమింకా గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నామనీ తెలియలేదు మాకు” అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటూ నిట్టూర్చింది అమ్మమ్మ.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments